క్లుప్తంగా

కళాకారులకు సత్కారం



మహిళా కళాకారులకు చీరలు అందిస్తున్న కృష్ణారావు దంపతులు

భామిని: మండల కేంద్రంలో దేవీ నవరాత్రులు సందర్భంగా కోలాటం ప్రదర్శన చేసిన కళాకారులకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొట్టుగుమ్మడి కృష్ణారావు దంపతులు ఆదివారం సత్కరించారు. మహిళా కళాకారులకు చీర, పసుపు, కుంకుమ ఇచ్చి అభినందించారు. శరన్నవరాత్రి వేడుకల్లో దేవీ మండపం వద్ద కళాకారులు కోలాటం ఆడి వీక్షకులను ఉత్సాహపరిచారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్

సీతంపేట: ఐటీడీఏలోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. గిరిజనులు తమ సమస్యలపై వినతులు సమర్పించవచ్చని అధికారులు తెలిపారు.

ఊరిస్తున్న వరుణుడు



గుమ్మలక్ష్మీపురం పరిసరాల్లో మేఘావృతమై ఉన్న ఆకాశం



భామినిలో కురుస్తున్న వర్షం

గుమ్మలక్ష్మీపురం: గత కొన్ని రోజులుగా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో వరుణిడి జాడ కానరావడం లేదు. దీంతో పంటలకు నీటితడులు అందక ఎండిపోతున్నాయి. రైతులు ఎన్నో వ్యయప్రయాసలు ఓర్చుకుని పంటలు సాగుచేస్తున్నారు. నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటకు నీటితడులు లేక ఎండిపోతున్నాయి. ప్రతిరోజు సాయంత్రం ఆకాశంలో మేఘాలు కమ్ముకుంటున్నా వర్షం మాత్రం కురవడం లేదు. చినుకు జాడ కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

భామినిలో భారీ వర్షం

భామిని: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత కొన్ని వారాలుగా వర్షాలు లేక ఎండిపోతున్న పంటలకు ఈ వర్షంతో ఊపిరివచ్చినట్లయిందని రైతులు అంటున్నారు. వాతావరణం కాస్త చల్లబడటంతో వేసవిని తలపించే ఎండలు, ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది.

డ్యాన్స్ పోటీ విజేత సామరిల్లి



విజేతలకు బహుమతులు అందిస్తున్న కమిటీ సభ్యులు

సీతంపేట: మండలంలోని దోనుబాయిలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన 'డ్యాన్స్ రాజా డ్యాన్స్' పోటీలో సామరిల్లి జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో కిల్లాడ జట్టు, తృతీయ స్థానంలో తాలాడ జట్టు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయుడు ఎస్.సంగమేసు, స్థానిక సర్పంచ్ కె.వెంకునాయుడు వ్యవహరించారు. కె.రవి, ఎస్.రవి యాంకర్స్‌గా పనిచేశారు.

యువకుల నిజాయితీ

పార్వతీపురం టౌన్: తమకు దొరికిన బ్యాగ్‌ను రైల్వే పోలీసులకు అప్పగించి యువకులు తమ నిజాయితీ చాటుకున్నారు. అబాలాసింగ్ శ్రీను, గొల్ల ప్రశాంత్, జమ్ము మురళి శనివారం రైలులో విశాఖపట్నం నుంచి పార్వతీపురం వస్తుండగా.. వారికి ఓ బ్యాగ్ దొరికింది. వెంటనే ఆ బ్యాగ్‌ను పార్వతీపురం రైల్వే పోలీసులకు అప్పగించారు. దీంతో ఆర్‌పీఎస్ సిబ్బంది ఆ యువకులను అభినందించారు.



ఆర్‌పీఎస్ సిబ్బందికి బ్యాగ్ అప్పగిస్తున్న యువత

మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ

హామీల అమలుపై లేదు

- కూటమి ప్రభుత్వం తీరుపై మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: కూటమి ప్రభుత్వానికి మద్యం అమ్మకాలపై ఉన్న శ్రద్ధ సూపర్–6 అమలుపై లేదని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఆదివారం ఆమె వండువలో మీడియాతో మాట్లాడారు. ఎంత సేపు మద్యం.. మద్యం.. మద్యం అంటూ జపం చేస్తున్నారే తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మళ్లీ మోసగించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భారీ స్కెచ్ వేస్తున్నారని కళావతి అన్నారు. ప్రజలకు సూపర్–6 అంటూ హామీలు ఇచ్చాం, ఇప్పుడు ఆ హామీలను చూస్తే భయమేస్తోందని ఆ మధ్యన అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై ప్రజలు దుమ్మెత్తిపోయడంతో ఆ విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఎన్నికల హామీలు అమలు చేయలేమన్నప్పుడు ప్రజలకు ఎందుకు మీరు మోసపూరితమైన హామీలు ఇచ్చారని ప్రశ్నించారు. 2014 ఎన్నికలకు ముందు సుమారు ఆరు వందలకు పైగా హామీలను మేనిఫెస్టోలో పెట్టి గెలిచిన వెంటనే మేనిఫెస్టోను మాయం చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కిందన్నారు. మళ్లీ ఇప్పుడు అధికారం చేపట్టిన తర్వాత 2014 మాదిరిగానే హామీలను తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 'అమ్మకు వందనం' వస్తుందని ఎన్నో ఆశలతో మీకు ఓట్లు వేసిన తల్లులకు పంగనామం పెట్టారని, ఉచిత గ్యాస్ సిలెండ్లు వస్తాయని ఎదురు చూసిన మహిళలకు గుండెలో మంటలు పెట్టారని, ఉచిత బస్సు ప్రయాణం అని ఊదరగొట్టి చివరకు ఎటూ తేల్చకుండా మహిళలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలు కూటమి ప్రభుత్వం నెరవేర్చేలా ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అక్రమాలు, అరాచకాలు పేట్రేగిపోతున్నాయని, ఆడవారి మానప్రాణాలకు రక్షణలేకుండా పోయిందన్నారు. నాటి బ్రిటిష్ పాలన కంటే ఘోరంగా రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహ ఆవిష్కరలో ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు

పాలకొండ రూరల్: దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనపాక సూర్యప్రకాష్, మండల సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. మండలంలోని ఓని గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం పలువురు దళిత, ఉద్యోగ సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎద్దు లిల్లీ పుష్పనాథం, నూతులపాటి భరత్‌భూషణరాజు, బత్తిన మోహనరావు, బి.గణేష్ బాబు, పి.రమేష్‌కుమార్, జైభీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

విరాళం అందజేత



ఆలయ కమిటీకి చెక్కులను అందజేస్తున్న దాతలు

భామిని: మండలంలోని తివ్వ కొండపై వెలసిన కోటకొండ దుర్గమ్మ మందిర నిర్మాణానికి గుమ్మలక్ష్మీపురం మండలం జి.శివడ వీఆర్‌ఓ నిమ్మల లక్ష్మీనారాయణ రూ.50 వేలు, ఎల్విన్‌పేట పీసీ జన్ని గణప్రసాద్ రూ.20 వేలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. మందిరం నిర్మాణానికి తమవంతు సహకారం అందిస్తామని దాతలు తెలిపారు. అంతకు ముందు దాతలు, మందిర కమిటీ సభ్యులు భక్తులతో కలిసి కోటకొండ దుర్గమ్మను దర్శించుకుని పూజలు చేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



తాళ్లడుమ్మలో కార్యకర్త కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు



మల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: ఇటీవల తాళ్లడుమ్మ, రావాడ గ్రామాల్లో అనారోగ్యంతో మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు ఆదివారం పరామర్శించారు. కార్యకర్తల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు పలువరు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మాజీ డిపూర్యటీ సీఎం పరామర్శ

మండలంలోని తుంబలి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ జి.మల్లేశ్వరరావు పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని మృతిచెందిన విషయం విదితమే. బాధిత కుటుంబాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఆదివారం పరామర్శించారు. మల్లేశ్వరరావు మృతికి సంతాపం తెలియజేసి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లు ఈశ్వరరావు, శిఖబడి సర్పంచ్ కోట రమేష్, కార్యకర్తలు ఉన్నారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

పాకొండ రూరల్: మండలంలో సోమవారం నుంచి 'పల్లె పండగ' కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మురళి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. టీకే రాజపురం వయా తలవరం మీదుగా టీడీ పారాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అలాగే అర్దలి, పద్మాపురం గ్రామలకు సంబంధించిన రహదారి పనులకు శంకుస్థానలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

- గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కే పాడు అడ్వంచర్ పార్క్ వద్ద 'పల్లె పండగ' కార్యక్రమం కింద మంజూరైన సీసీరోడ్డు పనులకు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం శంకుస్థాపన చేస్తారని మండల పరిషత్ ఇంజినీరింగ్ అధికారి కె.మురళీధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఈ రోడ్డు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎంపీడీఓగా రమేష్



జియ్యమ్మవలస: మండల ఎంపీడీఓ(ఎఫ్ఏసీ)గా ఎస్.రమేష్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొమరాడ మండలంలో ఏఓగా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందేందుకు కృషిచేస్తానన్నారు.

నేటి నుంచి 'పల్లె పండుగ'

మండలంలో సోమవారం నుంచి 'పల్లె పండుగ' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు టీకేజమ్ము, 10 గంటలకు పీటీమండ, 11 గంటలకు అలమండ, మధ్యాహ్నం 2 గంటలకు అర్నాడ, సాయంత్రం 4 గంటలకు శిఖబడిలో పల్లె పండుగ కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.

దోమ కాటుతో పాడికి చేటు



- అనారోగ్యం పాలవుతున్న పాడిపశువులు
- అవగాహన పెంచుకోకపోతే పశుసంపదకు నష్టం

పాలకొండ రూరల్: దోమల కారణంగా మనుషులే కాదు పశువులు కూడా అనారోగ్యం పాలవుతాయి. ఈ పరిస్థితిని ముందుగానే అధిగమిస్తే మూగజీవాలను ఆరోగ్యవంతంగా చూసుకోవచ్చు. అకాల వర్షాలు కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల మనుషులతో పాటు పశువులు కూడా రోగాల బారిన పడతాయి. దీంతో పశువులలో పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. ఒక్కోసారి పశువులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. పాలకొండ నియోజకవర్గంలో పాడిసంపదకు కొదవ లేదు. ఆవులు, గేదెలు 22వేల పైచిలుకు ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌లో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే పాడిపశువులు గొంతు వ్యాపు, దొమ్ము, గాలి కుంటు తదితర వ్యాధుల బారినపడే అవకాశం ఉంది. పశువుల్లో వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే పశువైద్య సిబ్బందిని సంప్రదించి సరైన చికిత్స అందివ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

దోమకాటుతో వచ్చే సమస్యలు

- పశువులను దోమలు ఎక్కువగా కుట్టడంతో అవి మేత సరిగా తీసుకోకపోవడంతో పాటు ఆకలి మందగించటం జరుగుతుంది. ఈ ప్రభావంతో పాల దిగుబడి తగ్గిపోతుంది.
- పశువు శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో రోజురోజుకు బలహీనపడుతుంది.
- దోమలు కుట్టినచోట చర్మం దురద వచ్చి పుండ్లు పడతాయి.
- పశువులకు మేత వేసే ప్రాంతం అంతా శుభ్రంగా లేకుంటే దోమలు చేరి పశువులు మేత తినే సమయంలో వాటిని బాధిస్తాయి. దీంతో మేత కూడా సరిగ్గా తీసుకోలేవు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పశువులను ఉంచే పాకలో దోమలు ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. షెడల్లో కట్టేసిన తరువాత దోమ తెరలు వాడటం శ్రేయస్కరం. సాయంత్రం పాడి పశువులను పాకలో కట్టే ముందు వేప ఆకులు లేదా సాంబ్రాణితో పొగ పెట్టాలి. పశువుల శాలల చుట్టూ వ్యర్థాలు, పొదలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. పశువులు కట్టేసిన ప్రాంగణాన్ని రోజూ శుభ్రం చేసుకోవడంతో పాటు చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవడం వల్ల దోమల బెడద నుంచి రక్షించుకోవచ్చు.

అపరిశుభ్రతతో సమస్య



పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి. పశువుల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మేత, దాణాకు అందించే పాత్రలు శుభ్రం చేయాలి. వైద్యుల సలహా మేరకు ఎప్పటికప్పుడు అవసరమైన టీకాలు, మందులు అందించాలి. దోమకాటు వలన ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడే అవకాశాలున్నాయి. పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నారు. – ప్రభా మాణిక్యరావు, పశుసంవర్ధకశాఖ ఏడీ, పాలకొండ



కిమ్మి గ్రామంలో కోలాటం ఆడుతున్న చిన్నారులు



హోమం వద్ద పూజలు చేస్తున్న భవానీ భక్తులు

భవానీ భక్తుల దీక్ష విరమణ

వీరఘట్టం: పట్టణంలో గత 11 రోజులుగా భవానీ దీక్ష చేపట్టిన భక్తులు ఆదివారం దీక్ష విరమించారు. యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో స్థానిక కోదండరామా కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన హోమం వద్ద భవానీలు పూజలు చేశారు. కుటుంబ సమేతంగా హోమంలో నెయ్యి, నవ ధాన్యాలను వేసి దీక్ష విరమించారు. అనంతరం వారంతా విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు పయనమయ్యారు.

ఆకట్టుకున్న కోలాటం

మండలంలోని కిమ్మి గ్రామంలో భవానీ భక్తులు ఆదివారం దీక్ష విరమణ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చిన్నారుల కోలాటం ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.


గరుగుబిల్లి: ఎస్ఆర్ పేటలో అమ్మవారి అనుపోత్సవం



వీరఘట్టం: భక్తులచే పూజలందుకున్న వీరఘట్టం కోటదుర్గతల్లి



జయహో దుర్గాభవానీ..



విజయ దశమి సందర్భంగా అమ్మవారి ఆలయాలకు శనివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కరుణించమ్మా కనకదుర్గమ్మా అంటూ జగన్మాతను ప్రార్థించారు. ఆలయాల వద్ద పలువురు భక్తులు తమ వాహనాలకు పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో మండపాల్లో ప్రతిష్టించిన అమ్మవారి ప్రతిమలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి నదుల్లో నిమజ్జనం చేశారు. తిరువీధిలో భవానీ భక్తుల భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. – పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



పాలకొండ: నవదుర్గల మట్టి విగ్రహాల తిరువీధి



భామిని: కీసర నవదుర్గామాత సన్నిధిలో నిర్వహించిన మహాచండీయాగంలో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు



వీరఘట్టం: దుర్గాదేవిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు



గుమ్మలక్ష్మీపురం: గౌడుగూడలో పాలజంగిడితో ఊరేగింపులో పాల్గొన్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



భామిని: బత్తిలిలో కోటదుర్గమ్మకు ఘటాలు సమర్పించేందుకు వెళ్తున్న ఎస్సై అనీల్‌కుమార్ దంపతులు



పాలకొండ రూరల్: కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో సామూహిక పూజలు

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



అటవీశాఖాధికారిని సన్మానిస్తున్న క్రీడాకారులు, సంఘాల నాయకులు, నిర్వాహకులు

పాలకొండ రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించి క్రికెట్ టోర్నీలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఛాలంజింగ్ కప్ ఫైనల్స్‌లో పాలకొండ–వీరఘట్టం జట్లు తలపడగా పాలకొండ జట్టు విజేతగా నిలిచింది.

ఈ కార్యక్రామనికి ముఖ్య అతిథిగా స్థానికుడు, ప్రస్తుత కడప జిల్లా అటవీశాఖాధికారి టి.రాజశేఖర్, ఉద్యోగ సంఘాల నాయకుడు ఎస్.భరత్‌భూషణ్‌రాజు, ఉత్తమ ఉపాధ్యాయులు కె.జనార్దనరావుతో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అటవీశాఖాధికారి రాజశేఖర్‌ను క్రీడాకారులు సన్మానించారు.

మాలతమ్మకు మకరతోరణం



మకరతోరణాన్ని అందజేస్తున్న దాతలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలం గొటివాడ పంచాయతీ నేరేడువలసలో వెలసిన మాలతమ్మ తల్లి విగ్రహానికి అలంకరించేందుకు రూ.50 వేలు విలువ చేసే మకరతోరణాన్ని కురుపాంకు చెందిన వ్యాపారులు పొట్నూరు రవి కుమార్, వూళ్ల సురేష్, రమేష్ వితరణ చేశారు. దసరా పండగను పురస్కరించుకుని శనివారం ఈ మకరతోరణాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తామన్నారు.